
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 17 । జూలై । 2025



సోమశిలలో 28.140 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారం నాటికి 28.140 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 2,806 క్యూసెక్కుల వం తున వరద వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,00,600
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.9,100
3 శాతం జీఎస్టీతో	రూ.9,373
నవర (8 గ్రా)	రూ.74,984

గరిష్టం/కనిష్టం
40.2 /29.5

వాతావరణం

జిల్లాలో గురువారం వాతావరణం పాక్షికం గా మేఘావృతంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. బుధవా రం గాలిలో తేమ 60 శాతంగా నమోదైంది

న్యూస్‌రీల్

వైఎస్ జగన్‌ను కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్



జగన్‌తో ఆనం అరుణమ్మ

నెల్లూరు సిటీ: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో రాజకీయ పరిణామాలు, అధికార పార్టీ సాగిస్తున్న దాష్టీకాలు, అధికార యంత్రాంగం అనుసరిస్తున్న ఏకపక్ష విధానాలపై చర్చించారు.

సోషల్ వెల్ఫేర్ డీడీకి చార్జ్‌మెమో

కలువాయి (సైదాపురం): జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మీటింగ్‌లో సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణికి చార్జ్‌మెమో ఇవ్వాలని డీఆర్‌ను కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. నెల్లూరు కలెక్టరేట్ ప్రాంగణంలో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు మురళీ కృష్ణయాదవ్, శ్రీరాములు మాట్లాడుతూ ఇటీవల కలువాయి ఎస్సీ బాలుర, బాలికల హాస్టల్లో తనిఖీ నిర్వహించిన డీడీ శోభారాణి అక్కడ ఎస్సీ, బాలుర హాస్టల్‌లో వార్డెన్, ట్యూటర్లు లేకపోయినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని, అజెండా లేకుండా సమావేశాన్ని నిర్వహించారంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో శాఖాపరమైన చర్యల నేపథ్యంలో డీడీకి చార్జ్‌మెమో ఇవ్వాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు.

ఉపాధ్యాయుడు కృష్ణ సస్పెన్షన్

సాక్షి ఎఫెక్ట్..

కావలి (జలదంకి): మండలంలోని లింగంగుంట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కృష్ణను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యా శాఖాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు కావలి ఎంఈఓ గోవిందయ్య తెలిపారు. టీచర్ కృష్ణ అనధికారికంగా పాఠశాలకు సెలవులు పెట్టకుండా హాజరు కాకపోవడంతో పాఠశాల మూతపడిన విషయాన్ని సాక్షి 'నేనెప్పుడొస్తే.. అప్పుడే బడి' శీర్షికన బుధవారం వెలుగులోకి తెచ్చింది. ఇదే సమయంలో సదరు ఉపాధ్యాయుడు కృష్ణ సీఆర్పీతో అసభ్య ప్రవర్తన వంటి కారణాలతోపాటు శని, ఆదివారం సెలవుల తర్వాత సోమ, మంగళవారాల్లో సైతం సెలవు పెట్టకుండా విధులకు హాజరు కాలేదు. విద్యార్థుల తల్లిదండ్రులు కావలి విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంఈఓ గోవిందయ్య ఈ విషయమై స్పందిస్తూ జిల్లా అధికారులకు సమాచారం ఇవ్వడంతో కృష్ణను సస్పెండ్ చేస్తూ డీఈఓ బాలాజీరావు ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు.

ఎరువులు, విత్తన దుకాణాల్లో సెంట్రల్ స్క్వాడ్ తనిఖీలు

• రూ.1,76,82,587 విలువైన స్టాక్ సీజ్



నరహరి ఫర్టిలైజర్స్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఉదయగిరి: పట్టణంలోని పలు ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాలను బుధవారం సెంట్రల్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేశారు. స్టాక్ రిజిష్టర్లు, ఇన్‌వాయిస్, బిల్లులు పరిశీలించారు. నకిలీ పురుగు మందులు, విత్తనాలను ఏవైనా ఉన్నాయోనని తనిఖీలు చేశారు. శ్రీ నరహరి ఫర్టిలైజర్స్‌లో పురుగు మందుల స్టాక్ రిజిస్టర్ ఫార్మాట్ రూపంలో లేనందున రూ.49,18,150 విలువైన స్టాక్‌ను, బాలాజీ ఫర్టిలైజర్స్‌లో ఇదే పరిస్థితి ఉండడంతో రూ.1,27,64,437 విలువైన స్టాక్‌ను సీజ్ చేశారు. సెంట్రల్ స్క్వాడ్ అధికారులు మాట్లాడుతూ రైతులు తీసుకున్న ఎరువులు, విత్తనాలు, పురుగు మందులకు తప్పనిసరిగా బిల్లులు అందజేయాలన్నారు. నాణ్యత లేని ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇందులో అధికారులు సీహెచ్ రవికుమార్, ఎస్.రాఘవరావు, నర్సోజీరావుతోపాటు ఉదయగిరి ఏడీఏ చెన్నారెడ్డి, ఏఓ కె.విజయభాస్కర్ ఉన్నారు.

ఓ రోగి.. రేపు రా



జిల్లా రెఫరల్ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి)లో రోగులకు వైద్య సేవలు అందడం గగనమే. సుదూర ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలు పడి వస్తే ఇక్కడ సిబ్బంది నుంచి వైద్యుల వరకు అలవి కాని నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. పది గంటలకు కాని వైద్యులు రారు. వచ్చినా.. గంట గంటన్నర కంటే ఎక్కువ సేపు ఉండరు. ఏదైనా వైద్య సేవ కోసం వచ్చిన వారికి పరీక్షలు రాసిస్తే.. రిపోర్టులు వచ్చే సరికి మధ్యాహ్నం 2 గంటలు పడుతోంది. వాటిని పట్టుకుని వైద్యుల వద్దకు వెళ్లే సరికి వారు వెళ్లిపోయి ఉంటారు. రిపోర్టులు పరిశీలించి మందులు రాసివ్వాలంటే.. మరుసటి రోజు రావాల్సిందే.



మధ్యాహ్నం 12.45 గంటలకే డాక్టర్లు వెళ్లిపోవడంతో ఖాళీగా కుర్చీలు



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

- పెద్దాస్పత్రిలో వైద్యం గగనం
- విధుల్లో సీనియర్ వైద్యుల నిర్లక్ష్యం
- టెస్ట్‌లు రాసిస్తారు.. రిపోర్టులు వచ్చేలోపు జంప్
- మధ్యాహ్నం 2 గంటల దాటితే రిపోర్టులు ఇచ్చేది పక్క రోజే!
- అందుబాటులో లేని అన్ని రకాల రక్తపరీక్షలు
- మందుల కొరత.. కనీస వసతులు కరువు
- పని చేయని లిఫ్ట్‌లు.. రోగులకు అవస్థలు

నెల్లూరు (అర్బన్): పెద్దాస్పత్రిలో గుండె, న్యూరాలజీ, యూరాలజీ, అంకాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలతోపాటు ఆర్థోపెడిక్, పల్మనాలజీ, నేత్ర, చర్మ, దంత, ఈఎన్‌టీ చిన్నపిల్లల వైద్యం తదితర స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉన్నాయి. వీరితోపాటు జనరల్ ఫిజిషియన్ విభాగం, జనరల్ సర్జరీ, గైనిక్ వంటి పలు ప్రత్యేక విభాగాలున్నాయి. డాక్టర్లు ఉదయం 8 గంటలకే విధులకు హాజరు కావాలి. ఇన్ పేషెంట్ల వార్డుల్లో రౌండ్స్‌కు వెళ్లి 9 గంటల అంతా ఓపీలోకి వచ్చి సేవ లందించాలి. మధ్యాహ్నం లంచ్ పూర్తయ్యాక సాయంత్రం 4 గంటల వరకు ఓపీ సేవలందించాలి. అయితే ఎక్కువ మంది డాక్టర్లు చుట్టపు చూపుగా 10 గంటలకు వస్తున్నారు. పట్టుమని 12 గంటల వరకు కూడా ఓపీలో కూర్చోవడం లేదు. ఆ కాస్త సమయం కూడా నాడి పట్టరు.. బీపీ చూడరు. ఏదో పేషెంట్‌ను చూశామా.. రెండు మాత్రలు రాశామా.. రక్తపరీక్షలు రాశామా అనే విధంగా వైద్యం అందిస్తున్నారు. మధ్యాహ్నం తర్వాత అడ్రస్ ఉండరు. రోగులకు పరీక్షలు రాసిస్తారు. ఆ రిపోర్టులు వచ్చే సరికి సీనియర్ డాక్టర్లు జంప్ అవుతున్నారు. ఆ తర్వాత జూనియర్ డాక్టర్లే దిక్కు. వీరు సైతం మధ్యాహ్నం తర్వాత సక్రమంగా రావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పేరుకే సూపర్ స్పెషాలిటీ సేవలు

పెద్దాస్పత్రిలో కేన్సర్, న్యూరో సర్జన్, యూరాలజీ, గుండె వంటి సూపర్ స్పెషాలిటీ డాక్టర్లున్నారు. వీరిలో ఎక్కువ మంది కార్పొరేట్ ఆస్పత్రుల్లో పని చేస్తున్నారు. పెద్దాస్పత్రిలో థంబ్ (హాజరు) వేసి ఒక గంట పాటు కూడా రోగులకు సేవలందించడం లేదు. రోగులకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టించుకునే వారు లేకపోవడంతో డాక్టర్ల ఇష్టారాజ్యంగా మారింది.

జ్వరాలతో పెరిగిన రోగులు

ప్రభుత్వ పెద్దాస్పత్రిలో ఓపీ సంఖ్య 1000 నుంచి 1300 వరకు ఉంటోంది. ఇన్ పేషెంట్ల సంఖ్య సుమారు 500 వరకు ఉంటోంది. ఓపీ రోగుల్లో కనీసం 300 నుంచి 350 మంది వరకు జ్వరాలు, ఒంటి నొప్పుల బాధితులే ఉండటం విశేషం. గత నెలతో పోలిస్తే 15 శాతానికి పైగా జ్వర పీడితులు ఎక్కువయ్యారు. జ్వరాల బారిన పడుతున్న చిన్న పిల్లలు, వార్డుల్లో చికిత్స పొందుతున్న వారు అధికంగా ఉంటున్నారు.

ప్రధాన మందుల కొరత

ప్రభుత్వ పెద్దాస్పత్రిలో కొన్ని రకాల కీలక మందులు అందుబాటులో ఉండడం లేదు. సైకియాట్రి(మానసిక) చికిత్సకు వాడే లిథియం కార్బొనేట్ 450 మి.గ్రా. మాత్రలు, రిస్‌పెరిడాన్ 2 మి.గ్రా. మాత్రలు, హాలోపెరిడాల్ 5 మి.గ్రా. మాత్రలు ఆస్పత్రిలో మందుల షాపు వద్దకు వస్తే అవి లేవని బయట కొనుగోలు చేయమని ఫార్మాసిస్ట్ రోగులకు చెబుతున్నారు. దీంతో బయట అత్యధిక ధరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పొత్తి కడుపులో మంట, ఇరిటేషన్‌కు వాడే సిట్రాల్కా సిరప్ (టానిక్) కూడా లేదు. చర్మానికి సంబంధించిన కాండిడ్ డెస్టింగ్ పౌడర్ రాసిచ్చినా ఆస్పత్రిలో దొరకదు. చెవికి సంబంధించిన డివాక్స్ చుక్కల మందులేదు. కొన్ని రకాల చర్మ సంబంధ మందులు కూడా లేవు.

లిఫ్ట్ మరమ్మతులు చేయక.. మెట్లు ఎక్కలేక

ల్యాబోరేటరీ విభాగంలోని మొదటి అంతస్తులో రక్త పరీక్షలు చేస్తున్నారు. అక్కడ పేరుకు మాత్రమే లిఫ్ట్ ఉంది. ఆ లిఫ్ట్ ఒక గంట పని చేస్తే పది రోజులు మరమ్మతులకు గురై ఉంటుంది. కొంత కాలంగా ఇదే తంతు. లిఫ్ట్ మరమ్మతుల పేరిట వేలాది రూపాయలు ఖర్చు అవుతున్నాయి. కానీ లిఫ్ట్ మాత్రం రిపేరుకు నోచుకోవడం లేదు. దీంతో పలువురు దివ్యాంగులు, ముసలి వారు మెట్లు ఎక్కి రాలేక కిందనే ఆగిపోతున్నారు. కొంత మంది రక్తపరీక్షలు చేయించుకోకుండానే వెనుదిరుగుతున్నారు. నడవలేని వారిని వీల్ చైర్‌లో తీసుకెళ్లేందుకు నాలుగో తరగతి ఉద్యోగులు అందుబాటులో ఉండటం లేదు. రోగుల బంధువులే తిరిగి, తిరిగి బతిమాలి ఎక్కడో ఉండే వీల్ చైర్‌ను తీసుకు వచ్చి నెట్టుకుని డాక్టర్, పరీక్షల వద్దకు పోతున్నారు.

పరీక్షల్లో నిర్లక్ష్యం.. రిపోర్టులైతే ఇవ్వరు

పెద్దాస్పత్రిలో కొన్ని రకాల రక్త పరీక్షలు చేయడం లేదు. సుమారు రెండు నెలలుగా థైరాయిడ్ ప్రొఫైల్ పరీక్షలు నిలిపేశారు. క్లోరైడ్, కాల్షియం టెస్ట్‌లే కాదు.. ఏబీజీ పరీక్ష కూడా చేయడం లేదు. ఇన్ పేషెంట్ల, అవుట్ పేషెంట్లకు వైద్యులు రక్త పరీక్షలు రాసిస్తారు. రిపోర్టులు ఇవ్వాలంటే మధ్యాహ్నం 2 గంటలకు రావాలని చెబుతారు. మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ విభాగం సిబ్బంది పరీక్షలు చేసి రిపోర్టులు రాసిస్తారు. అయితే క్లినికల్ పెథాలజీ విభాగంలో అయితే మధ్యాహ్నం 2 గంటల వరకే రిపోర్టులు ఇస్తాం.. ఇప్పుడు ఇవ్వడం కుదరదు. రేపు రండి రాసిస్తాం అని చెబుతున్న పరిస్థితి ఉంది. ఇక హెచ్ఐవీ పరీక్ష చేసే వారు మధ్యాహ్నం నుంచి ఉండడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేయించుకోవాలంటే ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకుని రెండు, మూడు రోజుల తర్వాత రావాల్సిన పరిస్థితి ఉంది.



వార్డులో ఉన్న ఇన్ పేషెంట్లు

మందులు బయటకు రాసిచ్చారు



నేను ఏడాదిగా పెద్దాస్పత్రిలోని సైకియాట్రీ విభాగంలో వైద్యం కోసం వస్తున్నాను. కొన్ని దఫాలు డాక్టర్ రాసిచ్చిన మందులుంటున్నాయి. వాటిని ఇస్తున్నారు. అప్పుడప్పుడు ఇక్కడ మందులు అయిపోతున్నాయంట. బయట కొనుక్కోమని చెబుతున్నారు. ఇటీవల కూడా కూడా ఒక రకం మందులు ఇచ్చారు.

– సురేష్, పోలూరు గ్రామం, సూళ్లూరుపేట మండలం

ఆస్పత్రిలోని పరిస్థితులు చక్కదిద్దుతున్నాను



నేను బాధ్యతలు చేపట్టి కేవలం రెండు వారాలు మాత్రమే కావస్తోంది. ఇక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించాను. లిఫ్ట్‌లు మరమ్మతులు చేయిస్తున్నాం. ల్యాబ్‌లో థైరాయిడ్ ప్రొఫైల్ పరీక్ష చేసేందుకు అవసరమైన రియేజంట్స్ కొనుగోలు చేయించాం. విధులకు సక్రమంగా హాజరు కాని డాక్టర్లపై చర్యలు తీసుకుంటాను.

– డాక్టర్ కె.మాధవి, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

తీర ప్రాంతాన్ని కబళించేందుకే కుట్రలు

- కరేడులో భూసేకరణ పేరుతో ప్రభుత్వం అడ్డగోలుగా జీఓలు
- ఇండోసోల్ కంపెనీకి గత ప్రభుత్వం కేటాయించిన భూములు ఎందుకు అప్పగించలేదు
- బీపీసీఎల్‌కు 8 వేల ఎకరాలు కేటాయిస్తున్న జీఓ ఇవ్వడం ఏమిటి
- పొంతనలేని జీఓలు, నోటిఫికేషన్లతో రైతుల్లో ఆందోళన
- కరేడు రైతులకు వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తుంది
- ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు

కందుకూరు: పరిశ్రమల పేరుతో తీర ప్రాతంలో వేల ఎకరాలను ప్రభుత్వం తన గుప్పెట్లో పెట్టుకునే కుట్రలు చేస్తోందని, అందులో భాగంగానే భూసేకరణ పేరుతో ఇష్టారీతిన జీఓలు విడుదల చేస్తుందని ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు ఆరోపించారు. బుధవారం తూమాటి తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలో ఇండోసోల్ కంపెనీ రూ.43,143 కోట్ల పెట్టుబడులతో 11,500 మందికి ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకు వచ్చిందని, ఆ కంపెనీ ప్రతిపాదనల ప్రకారం 2022లో 5,148 ఎకరాలు సేకరించి ఇచ్చేందుకు జీఓ ఇచ్చిందన్నారు. ఆ మేరకు గుడ్లూరు మండలం చేవూరులో 2,781 ఎకరాలను నోటిఫై చేసి, కంపెనీ నుంచి రూ.417 కోట్లను భూ సేకరణకు ఖర్చు చేసిందన్నారు. అందులో 1300 నుంచి 1400 ఎకరాలను వెంటనే కంపెనీకి ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వివరించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు ఇండోసోల్ కంపెనీకి ఆ భూములు అప్పగించలేదని చెప్పారు. కేవలం 114 ఎకరాల మాత్రమే గుర్తించినా 49 ఎకరాలనే అప్పగించిందని, మిగిలిన 65 ఎకరాలను కూడా పెండింగ్‌లో పెట్టిందన్నారు. ప్రస్తుతం ఈ 49 ఎకరాల్లోనే ఇండోసోల్ కంపెనీ కొన్ని యూనిట్లు ఏర్పాటు చేసిందన్నారు.

గందరగోళం జీఓలతో రైతుల్లో ఆందోళన

కూటమి ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 3న బీపీసీఎల్ కంపెనీ రూ.96,862 కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్లు, అందుకు 6 వేల ఎకరాలు కేటాయిస్తున్నట్లు జీఓను విడుదల చేసిందన్నారు. అప్పటికే ఇండోసోల్ కంపెనీ డబ్బులతో సేకరించిన భూములను ఆ కంపెనీకి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా బీపీసీఎల్‌కి కేటాయిస్తున్నట్లు ఎలా జీఓ ఇస్తారని నిలదీశారు. ఈ గందరగోళం ఇలా ఉండగానే మార్చిలో ఇండోసోల్ కంపెనీకి కరేడులో 8,364 ఎకరాలు భూములు ఇస్తున్నట్లు, ఆ కంపెనీ రూ.69 వేల కోట్లు పెట్టుబడులు పెట్టనున్నట్లు జీఓను విడుదల చేశారన్నారు. దీని ప్రకారం ఇండోసోల్ కంపెనీకి రూ.41 వేల కోట్ల ప్రభుత్వం రాయితీ ఇస్తున్నట్లు పేర్కొన్నారని వివరించారు. ఇదే ఇండోసోల్ కంపెనీకి గత ప్రభుత్వం రూ.27 వేల కోట్ల రాయితీలు ప్రకటిస్తే దోపిడీ అంటూ విమర్శించిన ప్రభుత్వ పెద్దలు, జగన్‌మోహన్‌రెడ్డి అనుచరులదంటూ, ఇష్టారీతిన రాయితీలు ఇస్తూ దోపిడీకి పాల్పడుతుందని గతంలో నానా యాగీ చేసిన ప్రభుత్వ పెద్దలు ఇప్పుడు అదే కంపెనీకి భారీగా రాయితీలు ఎలా ఇస్తున్నారని ప్రశ్నించారు. ఇదంతా ఇలా ఉంటే నాలుగు రోజుల క్రితం రామాయపట్నం పోర్టు అనుబంధంగా పరిశ్రమల ఏర్పాటు కోసం 20 వేల ఎకరాలు భూములు సేకరించాలంటూ కావలి భూసేకరణ ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో ఐదు టీంలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఇటు ప్రకాశం జిల్లాలోని సింగరాయకొండ వద్ద నుంచి అటు కావలి వరకు తీర ప్రాంతంలోని భూములను కబళించేందుకే ప్రభుత్వం కుట్రలు చేస్తున్నట్లు అర్థమవుతుందని చెప్పారు. ఇండోసోల్ కంపెనీకి కేటాయించిన భూములను ప్రస్తుతం బీపీసీఎల్ కంపెనీకి కేటాయించడంలో ప్రభుత్వ కుట్ర దాగి ఉందని ఆరోపించారు. ఆ కుట్రను అన్ని ఆధారాలతో త్వరలోనే బయటపెడతానని చెప్పారు.


కరేడులో 4,961 కుటుంబాలు రోడ్డున పడతాయి

ప్రభుత్వం చేపడుతున్న బలవంతపు భూసేకరణతో కరేడు పంచాయతీ పరిధిలోని 18 గ్రామాల పరిధిలో దాదాపు 4,961 కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిలో 2,352 కుటుంబాలు మత్స్యకార, 1,436 కుటుంబాలు యానాదులు ఉన్నారని, వీరంతా సముద్రంపై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. వీరందరిని ఖాళీ చేస్తే వారి జీవనం ఎలాగో సమాధానం చెప్పడం లేదన్నారు. కేవలం 2 వేల కుటుంబాలకు మాత్రమే భూములు ఉన్నాయని, అవి కూడా అర ఎకరం నుంచి ఎకరం లోపే ఒక్కొక్కరికి భూములు ఉన్నాయని చెప్పారు. కరేడులో బలవంతంగా భూములు సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధమవడం దారుణమన్నారు. ప్రభుత్వం చేస్తున్న ఈ దౌర్జన్యానికి వ్యతిరేకంగానే అక్కడి రైతులు ఉద్యమిస్తున్నారని, వారి ఉద్యమానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని వివరించారు.


ఖాళీ భూములను ఎందుకు ఇవ్వడం లేదు

నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోనే వేల ఎకరాల ప్రభుత్వ భూములు ఖాళీగా ఉన్నా ఆ భూముల్లో పరిశ్రమలకు కేటాయించడానికి ప్రభుత్వానికి ఉన్న ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. మాలకొండ ప్రాంతంలో నిమ్జ్ ఏర్పాటుకు సేకరించిన 12 వేల ఎకరాలు, దొనకొండలో 25 వేల ఎకరాలు, ఇఫ్కో కేటాయించిన భూములు ఖాళీగానే ఉన్నాయన్నారు. ప్రభుత్వ కుట్రలకు వ్యతిరేకంగా స్వచ్ఛందంగా ఉద్యమిస్తున్న కరేడు రైతులను తాము రెచ్చగొట్టి ఉద్యమాలు చేయిస్తున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యేగా రైతుల అభిప్రాయాలను గౌరవించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి కరేడు భూములను కాపాడాలని ఎమ్మెల్యే ఇంటూరికి సూచించారు.

ఏపీఎల్ క్రికెట్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



అశ్విన్‌హెబ్బార్



సాకేత్‌రామ్

నెల్లూరు (బృందావనం): ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) క్రికెట్ పోటీలకు సంబంధించి నిర్వహించిన వేలంలో జిలా క్రీడాకారులు ఏడుగురిని వివిధ ఫ్రాంచైజీలు కొనుగోలు చేశాయి. వీరిలో రంజీ క్రీడాకారుడు అశ్విన్‌హెబ్బార్ విజయవాడ సన్‌షైనర్స్ అత్యధికంగా రూ.10 లక్షలకు కొనుగోలు చేసింది. సాకేత్‌రామ్‌ను రూ.2.20 లక్షలకు రాయల్స్ ఆఫ్ రాయలసీమ, రేవంత్‌రెడ్డిని రూ.1.4 లక్షలకు భీమవరం బుల్స్ కొనుగోలు చేశాయి. భార్గవ్ మహేష్‌ను రూ.60 వేలకు అమరావతి రాయల్స్, పి.రోషన్‌ను రూ.60 వేలకు సింహాద్రి వైజాగ్ లైన్స్, టి.భరత్‌ను రూ.50 వేలకు విజయవాడ సన్‌షైనర్స్, తోషిత్‌యాదవ్‌ను రూ.30 వేలకు తుంగభద్ర వారియర్స్ కొనుగోలు చేశారు. జిల్లాకు చెందిన ఏడుగురు క్రీడాకారులు ఆగస్టు 8వ తేదీ నుంచి విశాఖపట్నంలో ప్రారంభం కానున్న ఏపీఎల్ పోటీల్లో వీరు పాల్గొననున్నారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాసులు అభినందించారు.

నివేదికలను ముందే అందజేయాలి

- కలెక్టర్ ఆనంద్
- అట్రాసిటీ కేసులపై సమీక్ష



మాట్లాడుతున్న ఆనంద్

నెల్లూరు రూరల్: అట్రాసిటీ కేసులకు సంబంధించిన యాక్షన్ రిపోర్టులను కమిటీ సభ్యులకు సమావేశానికి ముందే అందజేయాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని చైర్మన్, కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో బీసీ సంక్షేమ, సాధికారత శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఈ ఏడాది మే 31 నాటికి 88 అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని, ఇవన్నీ విచారణలో ఉన్నాయని చెప్పారు. ఈ త్రైమాసానికి గానూ 86 కేసులపై ఎఫ్ఐఆర్ నమోదు కాగా, 35 కేసులకు రూ.15 లక్షల పరిహారాన్ని అందించామని పేర్కొన్నారు. ఇంకా చార్జిషీట్ నమోదు చేసి పరిహారాన్ని ఇచ్చేందుకు రూ.2.7 కోట్లు అవసరమని తెలిపారు. కొన్ని ఎస్టీ కాలనీల్లో అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు నిబంధన మేరకు పిల్లలుండాలని వివరించారు. కరేడులో 4800 ఎకరాలకే నోటిఫికేషన్‌ను ఇచ్చామని, అక్కడ నివసిస్తున్న వారికి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూస్తామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ కల్యాణ్ చక్రవర్తి మాట్లాడారు. మానిటరింగ్ కమిటీ సమావేశానికి ప్రజాప్రతినిధులు, సభ్యులు హాజరయ్యేలా చూడాలని కోరారు. ఎస్పీ కృష్ణకాంత్, డీఆర్వో హుస్సేన్ సాహెబ్, కమిటీ సభ్యులు ప్రవల్లిక, ఏసుబాబు, ప్రభాకర్, శ్రీరాములు, స్వచ్ఛంద సంస్థల తరఫున మురళీకృష్ణయాదవ్, సాంఘిక సంక్షేమాధికారి శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీలు నిర్వహించండి

జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టేందుకు గానూ ఆకస్మిక తనిఖీలను చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. పీసీ, పీఎన్డీటీ చట్టంపై తన చాంబర్‌లో నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని వైద్యశాలలు, స్కానింగ్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలను చేపట్టాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. డీఎంహెచ్‌ఓ సుజాత, డీఎస్పీ రామారావు, డెమో కనకరత్నం, కవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తన ఖైదీగా పేరు తెచ్చుకుని..

- పదేళ్లకు పైగా జిల్లా జైల్లోనే
- అంతలోనే పరారీ.. జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తం
- ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు



ఇండ్ల సురేష్

సంగం: క్షణికావేశంలో హత్య చేశాడు. నేరం రుజువు కావడంతో పదేళ్లకు పైగా జిల్లా జైల్లో జీవిత ఖైదు అనుభవిస్తున్నాడు. సత్ప్రవర్తన ఖైదీగా పేరు తెచ్చుకున్నాడు. సత్ప్రవర్తనతో విడుదలయ్యే ఖైదీల జాబితాలో పేరు కూడా ఉంది. అంతలోనే జైలు నుంచి పరారై ఇన్నాళ్లుగా సంపాదించుకున్న సత్ప్రవర్తన పేరును పోగొట్టుకున్నాడు. సంగం మండలం గాంధీగిరిజన సంఘం గ్రామానికి చెందిన చౌడయ్య, పుల్లయ్య, జంగాలపల్లి నాంచారయ్య (25) 2011 జనవరి 16న సంక్రాంతి పండగల సమయంలో సాయంత్రం 5 గంటల సమయంలో సరదాగా పేకాట ఆడుతున్నారు. ఇంతలో ఇండ్ల సురేష్ అక్కడికి వెళ్లి తాను ఆడుతానని చెప్పాడు. మధ్యలో పుల్లయ్య వెళ్లిపోయాడు. మిగతా ముగ్గురి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో సురేష్ క్షణికావేశంలో కత్తితో నాంచారయ్యను పొడిచాడు. దీంతో నాంచారయ్యను భార్య అరుణతోపాటు కుటుంబ సభ్యులు, స్థానికులు వైద్యం కోసం బుచ్చిరెడ్డిపాళెం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సంగం పోలీసులు అదే రోజు రాత్రి ఇండ్ల సురేష్‌పై హత్య కేసు నమోదు చేశారు. కోర్టులో కేసు విచారణ జరగ్గా, నిందితుడు ఇండ్ల సురేష్‌పై నేరారోపణ రుజువు అయింది. ఈ క్రమంలో అతనికి జీవిత ఖైదు విధిస్తూ 2015 మార్చిన 9న తీర్పు వెలువడింది. అప్పటి నుంచి నెల్లూరు కేంద్ర కారాగారంలో జీవిత ఖైదీగా ఉన్నాడు. సత్ప్రవర్తన ఖైదీగా ఉండడంతో జైలు అధికారులు సైతం అతనికి ఓపెన్ జైలు పనులు అప్పగించారు. తాజాగా మూడు రోజుల క్రితం సైతం అతని కుటుంబ సభ్యులతో ములాఖత్ ద్వారా మాట్లాడారు. ఇంతలోనే అతను మంగళవారం సాయంత్రం జిల్లా కేంద్ర కారాగారం నుంచి తప్పించుకుని పరారీ అయ్యాడు. జైలు అధికారులు జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. సమాచారం అందుకున్న సంగం పోలీసులు గాంధీజన సంఘం చేరుకుని కుటుంబ సభ్యులను విచారించారు. అతని కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. దాదాపు పదేళ్లకు పైగా జిల్లా జైల్లో శిక్ష అనుభవిస్తున్న సురేష్ సత్ప్రవర్తన ఖైదీగా త్వరలోనే విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయని, అంతలోనే ఇలా జరగడంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

అడిగేదెవరు.. ఆపేదెవరు?

- ఇరిగేషన్ చెరువుల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు
- అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే..
- అనుమతి లేకుండా లేఅవుట్లు, రోడ్లకు తరలింపు
- అక్రమార్కులకు సహకరిస్తున్న ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారి
- కందుకూరు నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి

అధికార పార్టీ నేతలు నియోజకవర్గంలోని సాగునీటి చెరువులను గుల్ల చేస్తున్నారు. అక్రమార్జనే లక్ష్యంగా భారీ ఎత్తున తవ్వకాలు చేపడుతున్నారు. చర్యలు తీసుకోవాల్సిన ఇరిగేషన్ శాఖలోని ఓ ఉన్నతాధికారి గ్రావెల్ మాఫియాతో చేతులు కలపడంతో దందాకు అడ్డు లేకుండా పోయింది. ఇష్టారాజ్యంగా సాగుతున్న తవ్వకాలతో చెరువుల్లో గోతులు దర్శనమిస్తున్నాయి.



లింగసముద్రం మండలం పెదపవని చెరువులో ఇటీవల జరిగిన గ్రావెల్ తవ్వకాలు

కందుకూరు: అధికార పార్టీ నేతలు గ్రావెల్ మాఫియా అవతారమెత్తి నియోజకవర్గంలోని సాగునీటి చెరువులను ఆధీనంలోకి తీసుకుని ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేస్తున్నారు. కొద్దిరోజులుగా కందుకూరు మండలంలోని పలుకూరు చెరువు నుంచి గ్రావెల్ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. జేసీబీలతో పెద్దఎత్తున గ్రావెల్‌ను మహదేవపురం రోడ్డులోని ఓ ప్రైవేట్ వ్యక్తికి చెందిన స్థలానికి తోలుతున్నారు. అతను పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్ యజమాని కావడం గమనార్హం. ఈ దందాను అడ్డుకునేందుకు ఎవరూ సాహసం చేయడం లేదు. దీంతో చెరువులో లోతుగా గోతులు ఏర్పడుతున్నాయి. ఇరిగేషన్ శాఖకు చెందిన ఓ చిరుద్యోగి ఈ మట్టి తవ్వకాలను ఆపడానికి వెళ్లి భంగపడ్డాడు. అధికార పార్టీ నేతలు ఫోన్ చేసి బెదిరించడంతోపాటు, గ్రావెల్ మాఫియా అక్కడి నుంచి వెళ్లిపోవాలని హుకుం జారీ చేయడంతో ఏమీ చేయలేకపోయారు.

మాకెదురే లేదు

వాస్తవానికి సాగునీటి చెరువుల్లో గ్రావెల్ తవ్వకాలు చేపట్టాలంటే ఇరిగేషన్ శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం చెరువుల్లో గ్రావెల్ తవ్వకాల కోసం ఒక క్యూబిక్ మీటర్‌కు రూ.106 చెల్లించాల్సి ఉంది. కానీ గ్రావెల్ మాఫియా అనుమతి తీసుకోవడం లేదు. అధికార పార్టీలోని కొందరు కీలక నేతల అండదండలతో స్థానిక నాయకుల కనుసన్నల్లో వారికి ఇష్టమొచ్చినట్లు గ్రావెల్ తవ్వి తీసుకుపోతున్నారు. అధికారులు చలానా కట్టించుకుని అనుమతి ఇచ్చినా ఇరిగేషన్ శాఖకు భారీగా ఆదాయం వస్తుంది. అయితే ఆ పరిస్థితి లేదు. మాకెదురే లేదన్నట్లు మాఫియా చెలరేగిపోతోంది.



కందుకూరు మండలం పలుకూరు చెరువులో గ్రావెల్ తవ్వకాలు

ఆయనే అండ

గ్రావెల్ మాఫియాకు ఇరిగేషన్ శాఖలోని కీలక ఉన్నతాధికారి సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు విమర్శలున్నాయి. భారీగా ముడుపులు అందుకున్నట్లు ఆ శాఖలోని కొందరు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. దీనికి అనుగుణంగానే ఆయన వ్యవహారశైలి ఉండటం గమనార్హం. కింది స్థాయి సిబ్బంది తవ్వకాలను ఆపేందుకు ప్రయత్నిస్తే వెంటనే ఆ ఉన్నతాధికారి వారికి ఫోన్ చేసి 'అక్కడ మీకేం పని.. వచ్చేయండి' అని హుకుం జారీ చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఓ చెరువులో జేసీబీని ఆ శాఖ సిబ్బంది పట్టుకుని రూరల్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించి కేసు పెట్టాలని ఫిర్యాదు చేశారు. అయితే ఆ అధికారి ఎస్సైకి ఫోన్ చేసి తమ ఫిర్యాదును వెనక్కి తీసుకుంటున్నాం. కేసు వద్దని జేసీబీని విడిపించడం గమనార్హం. వీటిపై ఆ శాఖలోని సిబ్బంది ప్రశ్నిస్తే నేను ఒక్కడినే తీసుకుంటున్నానా.. పైఅధికారులకు కూడా ముడుపులు పంపుతున్నాను కదా అంటూ సమాధానం చెప్పడం పరిపాటిగా మారిందనే ఆరోపణలున్నాయి.



పలుకూరు చెరువు నుంచి మహదేవపురం రోడ్డులోని ప్రైవేట్ స్థలంలో తోలిన గ్రావెల్

ఫిర్యాదు చేసినా..

- ఇటీవల కొండికందుకూరు చెరువు నుంచి పెద్దఎత్తున మట్టి తవ్వకాలు చేపట్టారు. దీనిపై ఆ గ్రామ సర్పంచ్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్ననాథుడే లేడు. ప్రైవేట్ వ్యక్తికి చెందిన స్థలానికి, కొత్తగా నిర్మిస్తున్న విక్కిరాలపేట రోడ్డు మార్జిన్‌లకు చెరువు మట్టి తోలారు.
- గుడ్లూరు మండలం ఏలూరుపాడు చెరువు నుంచి రైల్వే లైన్ అభివృద్ధి పనుల కోసం 6,500 క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకునేందుకు కాంట్రాక్టర్లు అనుమతి తీసుకున్నారు. అయితే దాదాపు 13 వేల క్యూబిక్ మీటర్ల వరకు తవ్వకాలు చేశారు. కేవలం 90 సె.మీ లోతులోనే తవ్వకాలు చేయాలని నిబంధన ఉంది. కానీ మూడు మీటర్ల లోతు వరకు తవ్వినా ఇరిగేషన్ శాఖ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూసిన దాఖలాల్లేవు.
- ఉలవపాడు మండలం అలగాయపాళెం చెరువు నుంచి ఇటీవల రోడ్ల నిర్మాణానికి అనుమతి లేకుండా భారీ ఎత్తున మట్టి తవ్వకాలు చేపట్టారు. లింగసముద్రం మండలం పెదపవని చెరువు నుంచి అక్రమ తవ్వకాలు నిరంతరాయంగా సాగుతున్నాయి. ఆ గ్రామానికి చెందిన టీడీపీ నేతలు మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. రాళ్లపాడు ప్రాజెక్ట్‌కు సంబంధించి కాల్వల అభివృద్ధి పనుల్లో భాగంగా వెంకంపేట బ్రాంచ్ కెనాల్‌కు ఈ చెరువు నుంచి మట్టి తరలిస్తున్నారు.
- మాలకొండరాయునిపాళెం చెరువు నుంచి ఇదే పనుల కోసం గ్రావెల్ తవ్వకాలు చేశారు. వీటికి సంబంధించి ఇరిగేషన్ శాఖ నుంచి అనుమతి తీసుకోలేదు. గుడ్లూరు మండలం స్వర్ణాజీపురం చెరువు నుంచి ఇంటి స్థలాలకు 600 ట్రిప్పులు, ఇదే మండలం పాజర్ల చెరువు నుంచి మామిడి చెట్లకు భారీగా గ్రావెల్ తవ్వకాలు చేశారు.
- వలేటివారిపాళెం నలదలపూరు చెరువు నుంచి 300 ట్రిప్పుల గ్రావెల్‌ను తరలించారు.
- కందుకూరు మండలం కోవూరు చెక్‌డ్యాం నుంచి భారీగా ఇటీవల కాలంలో గ్రావెల్ తవ్వకాలు చేసి తరలించారు.

పోలీసులు న్యాయం చేయాలంటూ ఆందోళన



పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న బంధువులు

ఉదయగిరి: ఉదయగిరి ఆల్‌ఖైర్ కల్యాణ మండపం ఆస్తి గొడవలో ఐదురోజుల క్రితం షేక్ మహ్మమద్ హమీద్‌ను హత్య చేసిన నిందితులు గుంటుపల్లి హనీఫ్, ఉమర్‌అలీని కఠినంగా శిక్షించి న్యాయం చేయలంటూ బుధవారం పెద్ద సంఖ్యలో హతుడి బంధువులు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. పోలీసులు ఈ కేసుకు సంబంధించి ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదన్నారు. మహిళలు, యువకులు స్టేషన్‌కు తరలిరావడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. హత్య చేసిన నిందితులను పట్టుకున్నట్లు మీడియా ద్వారా తెలిసిందని, వారు ఎక్కడున్నారంటూ ఎస్సై శ్రీనివాసులును నిలదీశారు. నిందితుల కోసం ముమ్మరంగా గాలిస్తున్నామని, రెండు రోజుల్లో కేసు కొలిక్కి వస్తుందని ఎస్సై చెప్పారు. చట్ట ప్రకారం నడుచుకుంటూ ఈ కేసులో ఎవరి ప్రమేయం ఉన్నా అరెస్ట్ చేస్తామన్నారు. దీంతో వారు వెనుదిరిగారు. అంతకుముందు పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో కొంతసేపు ధర్నా చేశారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పారు. అనంతరం పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. హతుడి తండ్రి, సోదరుడు, బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు.

వడ్డిపాళెంలో ఇళ్లపై దాడులు

- ఐదుగురికి తీవ్రగాయాలు

ముత్తుకూరు(పొదలకూరు): మండలంలోని పిడతాపోలూరు పంచాయతీ కట్టకింద వడ్డిపాళెంలో బుధవారం ఓ వర్గానికి చెందిన వారి ఇళ్లపై మరో వర్గం వారు దాడులకు పాల్పడటంతో ఐదుగురు తీవ్రంగా, మరికొందరు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. పాతకక్షల నేపథ్యంలో రవి వర్గానికి చెందిన వారు మూకుమ్మడిగా సుమారు పది ఇళ్లపై కర్రలు, రాడ్లతో దాడులు చేశారు. దీంతో ఇళ్లు పాక్షికంగా దెబ్బతినగా, ద్విచక్ర వాహనాలు, ఆటోలు ధ్వంసమయ్యాయి. శీనయ్య, లక్ష్మయ్య, తిరుపతయ్య, వెంకటేశ్వర్లు, నరసింహులు, రమణయ్యకు కాళ్లు, చేతులు, తలపై గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోర్టు సీఐ రవినాయక్ పోలీస్ బందోబస్తుతో ఘర్షణలను అదుపు చేశారు. అంబులెన్స్‌లను రప్పించి బాధితులను ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పాత గొడవల నేపథ్యంలోనే ఓ వర్గంపై మరో వర్గం దాడులకు పాల్పడిందని, ఇందులో రాజకీయ పార్టీల ప్రమేయం లేదని స్పష్టం చేశారు. ఇలాంటి ఘటన వడ్డిపాళెంలో చోటుచేసుకోవడం రెండో పర్యాయమని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.



ధ్వంసమైన ద్విచక్ర వాహనాలు

కండలేరులో 29.707 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 29.707 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 1,720, పిన్నేరు కాలువకు 100, లోలెవల్ కాలువకు 90, మొదటి బ్రాంచ్ కాలువకు 75 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

భూ కబ్జాకు టీడీపీ నాయకుల యత్నం

- అడ్డుకున్న జనసేన నాయకులు

అనుమసముద్రంపేట: మండలంలోని పెద్దబ్బీపురం సమీపంలోని ఫీడర్ కెనాల్ వద్ద టీడీపీకి చెందిన కొందరు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించగా జనసేన నాయకులు అడ్డుకున్నారు. ఈ విషయమై వారి మధ్య మాటల యుద్ధం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఫీడర్ కెనాల్ వద్ద సర్వే నంబర్ 29 – 3, 29 – 4లో సుమారు 3.3 ఎకరాల భూమి ఉంది. దీనిపై టీడీపీ నాయకుల కన్ను పడింది. బుధవారం జేసీబీతో సదరు భూమిలో పిచ్చిమొక్కలను తొలగిస్తూ రోడ్డును ఏర్పాటు చేస్తున్నారు. దీని గురించి తెలుసుకున్న జనసేన నేత వెంకట్రావు అక్కడికి వెళ్లి టీడీపీ నాయకుడిని ప్రశ్నించారు. దీంతో వారి మధ్య మాటామాటా పెరిగింది. టీడీపీ నాయకుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు ఘటనా స్థలానికి చేరుకుని అక్కడి నుంచి వెళ్లిపోవాలని వెంకట్రావుకు తెలిపారు. ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా అడ్డుకోవాల్సిన అధికారులు స్థలం వద్దకు రావడం లేదని ఆయన మీడియాకు వివరించారు.



భూమిని చదును చేస్తున్న జేసీబీ

మానవ హక్కుల వేదిక నాయకుల పర్యటన

ఉలవపాడు: మండలంలోని కరేడు గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం మానవ హక్కుల వేదిక నాయకులు పర్యటించారు. పరిశ్రమలకు భూ సేకరణను వ్యతిరేకిస్తున్న గ్రామస్తులకు సంఘీభావంగా కరపత్రాలు పంచిపెట్టారు. ప్రజల ఆమోదాన్ని కాదని భూసేకరణ చేయడాన్ని వ్యతిరేకించారు. ప్రాజెక్ట్‌ను తక్షణమే రద్దు చేసి భూసేకరణ ప్రకటనలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్, రాష్ట్ర కార్యదర్శి రోహిత్, రాష్ట్ర చేనేత జనసమాఖ్య అధ్యక్షుడు మోహన్‌రావు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న నాయకులు

నిమ్మ ధరలు (కిలో)		
పెద్దవి	:	రూ.25
సన్నవి	:	రూ.15
పండ్లు	:	రూ.5

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ (లైవ్)	:	116
లేయర్ (లైవ్)	:	112
బ్రాయిలర్ చికెన్	:	210
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:	234
లేయర్ చికెన్	:	190

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కామరాజు

నెల్లూరు(బారకాసు): కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం కాకుండా లోకేశ్ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలులో ఉన్నట్లు అర్థమవుతోందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పందింటి కామరాజు అన్నారు. బుధవారం నెల్లూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిపై దాడి జరిగి రోజులు గడుస్తున్నా పోలీస్ వ్యవస్థ నుంచి సరైన స్పందన లేదన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలపై మాట్లాడిన నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారని చెప్పారు. వేమిరెడ్డి దంపతులు టీడీపీలో చేరగానే అమర్యాద, అవినీతి, అరాచకం, రౌడీయిజం వంటి లక్షణాలను అలవర్చుకున్నారని ఆరోపించారు. ప్రసన్నకుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌పై ఎటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారో ప్రజలు చూస్తున్నామన్నారు. ప్రశాంతిరెడ్డి రౌడీయిజం, గూండాయిజం చేయడం ప్రారంభించారని చెప్పారు. పోలీసులు వచ్చినా కూడా ఏ మాత్రం భయం లేకుండా దాడులు చేస్తున్నారంటే జిల్లాలో శాంతిభద్రతలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లా చరిత్రలో ఇటువంటి దాడి ఎప్పుడూ చూడలేదన్నారు. కోవూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు అనపల్లి ఉదయభాస్కర్ మాట్లాడుతూ ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై జరిగిన దాడి కచ్చితంగా ఆయన్ను అంతమొందించేందుకు జరిగిన ప్రయత్నమేనన్నారు. ఇందుకోసం వేమిరెడ్డి దంపతులు రూ.కోట్లు ఖర్చు పెట్టారన్నారు. ఇప్పుడు రూ.లక్షలు ఇచ్చి శాంతి ర్యాలీలు చేయిస్తున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు, నెల్లూరు రూరల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తోగురు జాషువా, నెల్లూరు సిటీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నవకోటి రాహుల్ గాంధీ, నాయకులు ఎండ్లూరు ఏసుదాసు, చిరుతోటి శశిధర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కామరాజు, పక్కన నేతలు

పూజ చేస్తుండగా..

- చీరకు నిప్పంటుకుని గాయపడిన వృద్ధురాలు
- చికిత్స పొందుతూ మృతి

నెల్లూరు సిటీ: ఓ వృద్ధురాలు ఇంట్లో పూజ చేస్తున్న సమయంలో చీరకు నిప్పంటుకుని గాయాలపాలై చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు.. న్యూమిలిటరీ కాలనీలో ఎం.విక్రమ్‌కుమార్‌రెడ్డి నివాసం ఉంటున్నారు. ఈనెల 6వ తేదీన అతను తన కుటుంబంతో దేవాలయానికి వెళ్లారు. విక్రమ్‌కుమార్‌రెడ్డి తల్లి వెంకటసుబ్బమ్మ (76) ఇంట్లో ఉన్నారు. ఆమె పూజ చేస్తుండగా చీరకు నిప్పంటుకుని గాయపడింది. విషయం అందుకున్న కుమారుడు ఇంటికి చేరుకుని తల్లిని హాస్పిటల్‌కు తరలించారు. ఆమె చికిత్స పొందుతూ మృతిచెందింది. వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి అనుమానాస్పద మృతి

- జీజీహెచ్ ఎదుట స్నేహితుల ఆందోళన



శ్రీకాంత్ మృతదేహం

నెల్లూరు సిటీ: ఓ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలానికి చెందిన జానా శ్రీకాంత్ (23) నెల్లూరు రూరల్ పరిధిలోని కాకుపల్లి గ్రామంలో ఉన్న సన్ ఫార్మసీ కళాశాలలో పీజీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద రమణయ్య హాస్పిటల్లో ఫార్మసిస్ట్‌గా పార్ట్‌టైం పనిచేస్తున్నాడు. శ్రీకాంత్ హాస్పిటల్లో విధుల్లో ఉండగా కింద పడిపోయాడు. దీంతో సిబ్బంది ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీకాంత్ స్నేహితులు జీజీహెచ్‌కు చేరుకుని ఆందోళన చేశారు. రమణయ్య హాస్పిటల్లోనే విద్యుదాఘాతానికి గురై అతను చనిపోయాడని ఆరోపించారు. అయితే సిబ్బంది మాత్రం హార్ట్ ఎటాక్ అని చెప్పడంపై అనుమానం వ్యక్తం చేశారు. వారి నిర్లక్ష్యంతోనే తమ స్నేహితుడు మృతిచెందాడని ఆగ్రహించారు. ఈ క్రమంలో జీజీహెచ్ వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.